'పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించాలి'

సరూర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పనులకు కార్పొరేషన్ తరఫున సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టాయిలెట్స్‌ను శుభ్రం చేసే సిబ్బందిని నియమించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. స్థానిక సంస్థలు నిధులు కేటాయించి సిబ్బందిని నియమించుకునే వెసలుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా అమలు కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తపేట బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట బస్తీలో సుమారు రూ. 8 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పైపులైన్ పనులను కార్పొరేటర్ పవన్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండిపోవడంతో జలమండలి సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టార్ విజేందర్‌రెడ్డి, నాయకులు అశ్విన్‌సింగ్, కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలను అరికట్టాలి : పీవైఎల్

సరూర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో గల బస్తీలు, మురికివాడలు, నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) ప్రతినిధులు మీర్‌పేట్ పోలీసులను కోరారు. పీవైఎల్ ప్రతినిధులు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ నగర అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి బీఎస్ కృష్ణ, బాలాపూర్ ఏరియా కమిటీ అధ్యక్షుడు కె.రాకేశ్, కార్యదర్శి కె.భూమేశ్, నాగరాజు, శంకర్, మహేశ్, కాశీనాథ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి'

సైదాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగకు గోవులను అక్రమంగా తరలిస్తున్నా కొంతమంది పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి ఆరోపించారు. మంగళవారం లక్ష్మీనగర్ కాలనీలో అఖిల భారత గోసేవా ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గోవులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. గో రక్షణ చట్టాలను అమలుచేయాలని, గోవులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోసేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, రాఘవేందర్, మాణిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ

హయత్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ, రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తున్నట్లు చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాలక వర్గం సభ్యులతో కలిసి రెగ్యులర్, పదోన్నతుల ఆర్డర్‌ను ఉద్యోగులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 15 నుంచి 20 సంవత్సరాలుగా మదర్ డెయిరీలో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న 238 మందిని క్రమబద్ధీకరిస్తున్నామని, వివిధ హోదాల్లో పనిచేస్తున్న 181 మంది ఉద్యోగులకు పదోన్నతులు ఇస్తున్నామని చెప్పారు. సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పాలకవర్గం ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు వెంకట్రామిరెడ్డి, ఫిరంగి వెంకట్రామిరెడ్డి, రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి, మండడి ప్రభాకర్‌రెడ్డి, కస్తూరి పాండు, జాల రాంరెడ్డి, కందాల అలివేలు రంగారెడ్డి పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బలాల

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

చాదర్‌ఘాట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలో ఆరు మున్సిపల్ డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై ఎమ్మెల్యే అహ్మద్ బలాల జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ. 17 కోట్ల వ్యయంతో చేపట్టిన 116 అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో రూ. 4 కోట్ల వ్యయంతో చేపట్టిన బాక్స్‌టైప్ డ్రెయిన్ పనులను వచ్చే నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఈ పీర్‌సింగ్‌కు ఎమ్మెల్యే సూచించారు.

అధిక డొనేషన్‌లు వసూలు చేస్తున్న

ఏఈ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి : ఐఎస్‌యూ

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అటానమస్ ఇంజనీరింగ్ (ఏఈ) కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక డొనేషన్‌లు వసూలు చేస్తున్నాయని, వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు డిమాండ్ చేశారు. ఆయా కళాశాలలు ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల నుంచి డొనేషన్, ఇతర ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రముఖ కళాశాలలతోపాటు సెకండ్, థర్డ్ గ్రేడ్ ఉన్న కాలేజీలు కూడా కొత్త రూల్స్ పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అటానమస్ పేరుతో ఆయా కళాశాలలు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని గుర్తుచేశారు.

గ్రూప్-2, 3 పరీక్షలకు ఉచిత శిక్షణ

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న గ్రూప్-2, 3 పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 45 రోజులపాటు ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. అభ్యర్థులు హైదరాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, దరఖాస్తులను ఈనెల 18లోగా ఆబిడ్స్‌లోని తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, నాంపల్లి హజ్‌హౌస్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. తరగతులు 19వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 040-23240134 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శారీరక వైకల్యం ఉన్నవారికి ఉచిత వైద్య శిబిరం 15న

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 15న శారీరక వైకల్యం ఉన్నవారికి ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న హాకా భవన్‌లోని భరోసా సెంటర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

'గాంధీ'కి రూ. 50 లక్షల విలువైన వైద్య పరికరాలు సాయం

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి, ప్రవాసాంధ్ర వైద్యుడు దినేష్‌రెడ్డి గాంధీ ఆస్పత్రికి రూ. 50 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను గ్యాస్ట్రో విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. 20 ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉంటూ సామాజిక సేవలో పాల్గొంటున్నాని దినేష్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడిగా ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హెల్త్‌కేర్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై పరిశోధించిన డాక్టర్ దినేష్‌రెడ్డి నివేదికను గత ప్రభుత్వానికి అందజేసినట్లు గుర్తు చేశారు. ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ దినేష్‌రెడ్డిని అభినందించారు.

మ్యాన్‌హోళ్లు తెరిస్తే క్రిమినల్ కేసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మ్యాన్‌హోళ్ల మూతలు తెరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాటర్‌బోర్డు హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించి మ్యాన్‌హోళ్ల మూతలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంది. వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వాటర్‌బోర్డు యాక్ట్ -198 9సెక్షన్74 ప్రకారం అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతోపాటు జైలు శిక్ష కూడా వేసే అవకాశముంది. నగరంలో ఎక్కడైనా మ్యాన్‌హోల్


మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్

మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనిస్తే వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్‌చేసి సమాచారమివ్వాలని, దగ్గరలోని వాటర్‌బోర్డు కార్యాలయాల్లో నేరుగా సంప్రదించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి సూచించారు. వర్షం వస్తే మ్యాన్‌హోళ్లలో పడి మృతి చెందిన ఘటనల నేపథ్యంలో వాటర్‌బోర్డు అప్రమత్తమైంది. మ్యాన్‌హోళ్లను తెరవకుండా నగరవాసుల్లో అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరికలు జారీ చేసింది. ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంది. 25వేలకు పైగా మ్యాన్‌హోళ్లకు సేఫ్టీగ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, రెడ్ పెయింట్ వేశారు. మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో సీవరేజి బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు.

విస్తృతంగా ప్రచారం

వర్షాకాలంలో సీవరేజి నిర్వహణలో పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై వాటర్‌బోర్డు విరివిగా ప్రచారం చేస్తోంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. చేయాల్సిన, చేయకూడని పనులపై పత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి సమాయత్తమవుతోంది.

శాఖల సమన్వయంతో పనులు

జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో పనులు చేయనున్నారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్(ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలను అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీవాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తారుఎయిర్‌టెక్ మెషీన్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాల(సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారు.

రూ. 10 కోట్లు కొల్లగొట్టారు

- యూట్యూబ్ చానళ్లలో ప్రచారం నిర్వహించిన కేటుగాడు
- శిక్షణ కోసం రూ. లక్ష ఫీజు వసూలు
- సహకరించిన భార్య, కొడుకు, అడ్వొకేట్
- నలుగురి అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వారు ఉన్నంత కాలం మోసం చేసే వారు ఉంటారనడంలో అతిశయోక్తి లేదు. ఏపీకి చెందిన శివయ్య సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం భార్య, కొడుకు, ఓ అడ్వొకేట్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రెండు యూ ట్యూబ్ చానళ్ల ఏర్పాటుచేశారు. ఓ చానల్ ద్వారా ప్రకృతి వైద్యుడిగా శివయ్య ప్రచారం చేసుకున్నాడు. మరో చానల్ ద్వారా రియల్ ఎస్టేట్‌లో డబ్బు సంపాదించేందుకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ తీసుకునే వారి నుంచి రూ. లక్ష ఫీజు వసూలు చేశారు. మొత్తం రూ. 10 కోట్లకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టి మంగళవారం నలుగురిని అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ఏపీకి చెందిన శివయ్య అలియాస్ శివకుమార్ భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వకేట్‌తో కలిసి సులభంగా డబ్బు సంపాదించేందుకు పథకం వేశాడు. మీమాంస, రీబూట్ పేరుతో రెండు యూ ట్యూబ్ చానళ్ల ప్రారంభించారు. ప్రకృతి వైద్యంపై అవగాహన ఉండటంతో మీమాంస చానల్ ద్వారా శివయ్య బీపీ, మధుమేహం, థైరాయిడ్, కేన్సర్ వ్యాధులకు సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. నమ్మిన వారిని మభ్యపెట్టి రీబూట్ అనే మరో చానల్ ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో డబ్బు సంపాదన కంటూ శిక్షణ ఇచ్చేవాడు. ఇందుకుగాను రూ. లక్ష ఫీజు వసూలు చేసేవాడు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో లాభాలొస్తాయని నమ్మించాడు. నమ్మిన 70 మంది లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. వారి నుంచి శివయ్య రూ. 10.86 కోట్లు కొల్లగొట్టాడు. ఎంతకూ లాభాలు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన వారు నిలదీయగా తాను గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలకు బినామీ అని, నన్ను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరించాడు. శివయ్య తీరుపై అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా అరెస్టు చేశారు. అతడిని విచారించగా.. భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వొకేట్ శ్రీనివాస్‌తో కలిసి మోసం చేస్తున్నట్టు చెప్పాడు. వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన శివకుమార్, అతని కొడుకు జశ్వంత్ గతంలో జైలు కెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. మళ్లీ మోసాలకు పాల్పడుతున్నారు. మీమాంస, రీబూట్ పేరుతో జరిగే మోసాలను నమ్మొద్దని, ఆర్థిక మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీసీఎస్ డీసీపీ సూచించారు.

పాఠశాలల్లో సదుపాయాలపై దృష్టి సారించండి

బడంగ్‌పేట మేయర్ పారిజాతారెడ్డి


అల్మాస్‌గూడ పాఠశాలలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్, కమిషనర్ రఘు

సరూర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభం అవుతున్న దృష్ట్యా అధికారులు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన సదుపాయాలపై దృష్టి సారించాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం అల్మాస్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభించేలోగా గదులను, పరిసరాలను శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, మునిసిపల్ కమిషనర్ రఘు, అల్మాస్‌గూడ కార్పొరేటర్ జెనిగె పద్మాఐలయ్య యాదవ్, మునిసిపల్ డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈ వినీల్‌గౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

అనంతరం నాదర్‌గుల్ 8వ డివిజన్ కమ్మగూడలో మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కమిషనర్ రఘు పర్యటించి నాలాను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున నాలాలో చెత్తాచెదారం తొలగించాలని, డ్రైనేజీ పైపులైన్‌లను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు.

భారీ వర్షం

- మలక్‌పేట ఆర్‌యూబీ, మూసారాంబాగ్ బ్రిడ్జిపై వరద నీరు
- దాదాపు రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం


మూసారాంబాగ్ బ్రిడ్జిపై వరద నీరు


ట్రాఫిక్ జామ్

చాదర్‌ఘాట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్‌యూబీపై వరద నీరు భారీగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముసారాంబాగ్ బ్రిడ్జిపై కూడా వర్షం నీరు భారీగా చేరింది. మలక్‌పేట మార్కెట్ ఎదుట న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ కింద వరద ప్రవాహంతో వాహనాదారులు ఇబ్బందులకు గురయ్యారు. అక్షయ్ హోటల్ ఎదుట, ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ దేవాలయం వద్ద మోకాలి లోతు వరకు వరద నీరు ప్రవహించింది. మలక్‌పేట, ముసారాంబాగ్, శాలివాహననగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా చాదర్‌ఘాట్ నుంచి మూసారాంబాగ్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 2 నుంచి 3 గంటల వరకు వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు.

ఉస్మానియా ఆస్పత్రికి అంబులెన్స్ అందజేత


ఉస్మానియా ఆస్పత్రికి అంబులెన్స్ అందజేస్తున్న మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా

చంపాపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్)లో భాగంగా మిధాని తరఫున సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా ఉస్మానియా ఆస్పత్రికి అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పేదలను ఆదుకునేందుకు సీఎస్‌ఆర్ ఫండ్ నుంచి మిధాని హెల్త్‌కేర్, శానిటేషన్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా ఉస్మానియా ఆస్పత్రికి రూ. 31 లక్షల విలువైన అంబులెన్స్ అందజేశామని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రికి అంబులెన్స్ అందించడంపై సూపరిండెంట్ డాక్టర్ బి.నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మిధానీ డైరెక్టర్(ఫైనాన్స్) ఎస్.గౌరీ శంకర్‌రావు, డైరెక్టర్(ప్రొడక్షన్, మార్కెటింగ్)టి.ముత్తుకుమార్, సీవీఓ డాక్టర్ ఉపేంద్ర వెన్నం, జీఎం(హెచ్ఆర్) ఏ.రామకృష్ణారావు పాల్గొన్నారు.

వరుసగా ఐదిళ్ల తాళాలు పగులగొట్టిన దొంగలు

- అరకిలో వెండి వస్తువులు, రూ. 5 వేలు అపహరణ


చిందరవందరగా పడేసిన వస్తువులు

హయత్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజయ్ గుల్మార్ గేటెడ్ కమ్యూనిటీలో సోమవారం రాత్రి దొంగలు వరుసగా ఐదు ఇళ్ల తాళాలు పగుల గొట్టారు. క్షత్రియ గణేష్‌సింగ్ ఇంట్లో రూ. 5 వేలు, అరకిలో వెండి వస్తువులు అపహరించారు. గణేష్‌సింగ్ దంపతులు సోమవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆయన ఇంటి తెలుపులు తెరిచి ఉండడాన్ని చూసిన పక్కంటి వారు గణేష్‌సింగ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆయన వెంటనే ఇంటికి చేరుకొని పరిశీలించగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. నగదు, వెండి వవస్తువులు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించి సీసీ పుటేజీలను పరిశీలించారు. దొంగలను త్వరలో పట్టుకుంటామని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పారా మిలిటరీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి'

కొత్తపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పారా మిలిటరీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి సీఏపీఎఫ్ మాజీ సిబ్బంది సంక్షేమ సంఘం విన్నవించింది. మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రతినిధులు మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌ను కలిసి సమస్యలు వివరించారు. తెలంగాణలో సీఏపీఎఫ్ సిబ్బంది పిల్లలకు సీఏపీ కోటా కింద 2 శాతం ఇంజనీరింగ్ కళాశాలల్లో, మెడికల్ కాలేజీల్లో సీట్లు కేటాయించాలని, సీఏపీఎఫ్ సిబ్బందికి ఇంటి పన్ను మినహాయింపు ఇవ్వాలని, సీఎస్‌డీ క్యాంటీన్లలో సదుపాయాలను తమకూ వర్తింపజేయాలని, మల్టీపర్పస్ హాల్ నిర్మించడానికి స్థలం కేటాయంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మామిల్ల రాజు, సలహాదారులు ఎస్ఎన్‌రెడ్డి, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ కాలనీలో చేపట్టబోయే వరదనీటి పైప్‌లైన్, రోడ్డు పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికి పై కాలనీల నుంచి వచ్చే వర్షపు సాయిరాం నగర్, శ్రీనివాస కాలనీల నుంచి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి పైపులైన్ నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, అధికారులు రఫీ, ఏఈ ప్రజ్ఞ పాల్గొన్నారు.

'అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'

వనస్థలిపురం, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం జీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ హైకోర్టు కాలనీలో నిర్మిస్తున్న వరదనీటి కాలువ పనులను మంగళవారం పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రమేష్ బాబు, డీఇ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు : డీఎల్‌పీవో

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను డీఎల్‌పీవో మంద సాధన పంచాయతీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 191లో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలను డీఎల్‌పీవో పరిశీలించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద, పంచాయతీ కార్యదర్శి శశిధర్, ఎంపీటీసీ గ్యార బాల లింగస్వామి, బీఎస్పీ నేత గ్యార మల్లేష్, చిత్రం కృష్ణ, ధన్‌రాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి'

వనస్థలిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో పలు కాలనీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జోనల్ కమిషనర్ పంకజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లు, పార్కుల అభివృద్ధి, కాలనీ సంక్షేమ భవనాలు, వీధి లైట్లు తదితర మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు.


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు (ముసుగు ధరించిన వారు), వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి ఏసీపీ కిష్టయ్య

పాత కక్షలతోనే యువకుడి హత్య

- ఐదుగురు నిందితుల అరెస్ట్

సరూర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన మీర్‌పేట్‌లో యువకుడి హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ కిష్టయ్య వివరాలు వెల్లడించారు. మీర్‌పేట నందనవనంలో నివసిస్తున్న సల్మాన్(25), నూరి పరిచయస్తులు. వీరిద్దరూ పాత నేరస్థులు. నూరి 2021లో సల్మాన్ సోదరి షబాఫాతిమాను కిడ్నాప్ చేసి ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీనిపై అప్పట్లో ఎల్బీనగర్ పీఎస్‌లో కిడ్నాప్ కేసు నమోదవగా నూరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మతంతోపాటు మోయిన్‌గా పేరు మార్చుకున్నాడు. అనుమానంతో భార్య షబా ఫాతిమాను హత్యచేశాడు. ఈ కేసులోనూ నూరి జైలుకెళ్లాడు. బయటకు వచ్చిన తర్వాత సల్మాన్‌కు వరుసకు కోడలు అయిన మంచాల స్వర్ణలతతో చనువుగా ఉంటున్నాడు. గమనించిన సల్మాన్ వారిని పలుమార్లు మందలించాడు.

ఈ క్రమంలో వారి మధ్య కక్షలు పెరిగాయి. నూరిని హతమార్చాలని సల్మాన్ నిర్ణయించుకున్నాడు. ఇది గమనించిన నూరి సల్మాన్‌ను హత్యచేయాలని పథకం వేశాడు. దీనికి స్వర్ణలత సాయం కోరాడు. సల్మాన్‌ను హత్య చేసేందుకు సరూర్‌నగర్ పోచమ్మబాగ్‌కు చెందిన బొర్ర అరుణ్‌కుమార్, కొత్తపేట్ గోకుల్‌నగర్‌కు చెందిన డి.లక్ష్మణ్, తలకొండపల్లికి చెందిన కేతావత్ అరుణ్ సాయం కోరాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి పథకాన్ని అమలు చేశాడు. పథకంలో భాగంగా సల్మాన్‌కు స్వర్ణలతతో ఫోన్ చేయించి టీకేఆర్ కమాన్ సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించారు. సల్మాన్ అక్కడకు వెళ్లగానే అరుణ్ కుమార్, లక్ష్మణ్, అరుణ్ పట్టుకోగా నూరి కత్తితో గుండెల్లో పొడిచి, గొంతు కోసి హతమార్చాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితులను కుర్మల్‌గూడలో మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించారు.

నెలలు నిండని శిశువు మృతదేహం లభ్యం

కొత్తపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తట్టిఅన్నారం ఆదివాసి కాలనీలోని ఓ పాత ఇంటి పక్కన వ్యర్థాల మధ్యన నెలలు నిండని ఆడ శిశువు మృతదేహాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కాలనీ అధ్యక్షుడు రమావత్ మట్టయ్య సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.